# మద్యం

## – మా. శ్రీరాజు





మధు పనిచేసే ఆఫీసులో అందరూ మద్యం ప్రియులే!

మధు ఒక్కడే పరమ నిష్టగా వుంటూ, దాని జోలికి పోకుండా వుంటున్నాడు.

ఒకసారి వాళ్ళ ఆఫీసులో ఒక ఉద్యోగి వేరే ఊరికి ట్రాన్స్‌ఫర్ కావటంతో, అందరూ కలిసి అతనికి పార్టీ ఇద్దామనుకున్నారు.

అనుకున్న తేదీకి మద్యం సీసాలు ప్రత్యక్షమై, అనుకున్న తేదీన పార్టీ మొదలయింది.

అందరూ మద్యాన్ని చిత్తుగా తాగుతున్నారు.

మధుకి బోర్ కొట్టి వాళ్ళతో "ఇగ నేను ఇంటికి వెళతాను" అన్నాడు.

"నువ్వూ తీసుకోరా" అన్నాడు ఒకడు మద్యం సీసా అందిస్తూ.

"అబ్బే నాకు అలవాటు లేదు" అన్నాడు మధు ఖచ్చితంగా.

"వీడికి అలవాటు లేదు. ఇగ అలవాటు కూడా కాదురా. వీడసలు మగాడయితేగా. మగ పుటక పుడితేగా మద్యం పుచ్చుకోవటానికి" అన్నాడు హేళనగా ఇంకొకడు.

"వీడు వీడి పెళ్ళానికి బానిసరరా. వీడు మద్యం పుచ్చుకుంటే వీడి పెళ్ళాం వీడిని ఇంట్లో ఉతికి ఆరేస్తుందిరా. ఆఫీసులో అయితే పులిగాని ఇంట్లో అయితే పిల్లిరా వీడు" అన్నాడు వెటకారంగా రెచ్చ కొడ్తూ మరొకడు.

ఈ మాటలు మధులో పౌరుషం తెప్పించాయి.

వెంటనే విసురుగా సీసా అందుకొని గటగటా త్రాగేశాడు.

అంతా "శభాష్" అని చప్పట్లు చరుస్తూ హర్ష ధ్వానాలు చేశారు.

అది లగాయితు మధు రాను రాను మద్యానికి బాగా బానిస అయిపోయాడు.

అది లేనిదే పూర్తిగా బ్రతకలేని స్థితికి వచ్చాడు.

తన బలహీనతకి వచ్చే జీతం సరిపోక, ఇంట్లో సామాన్లు అమ్మేయటం, అప్పులు చేయటం కూడా ప్రారంభించాడు.

చీటికి మాటికి భార్యా బిడ్డల మీద విసుక్కోవటం, దురుసుగా దుర్భాషలాడటం, అప్పుడప్పుడు వాళ్ళపై చెయ్యి చేసుకోవటం కూడా మొదలయింది.

ఇంట్లో ప్రశాంత వాతావరణం పోయి, కలుషిత వాతావరణం చేరేసరికి, ఇది వరకు ఎంతో గౌరవించే ఆ చుట్టు ప్రక్కల వాళ్ళు ఇప్పుడు మధుని చూసి ఎంతో అసహించుకోసాగారు.

అప్పుడప్పుడు తప్ప తాగి ఒళ్ళు సోయలేకుండా ఏ రోడ్డు ప్రక్కో, ఏ మురికి కాలువలోనో పడిపోతే ఎవరో తెలిసిన వాళ్ళు ఇంటికి మధుని మోసుకు రావటం కూడా పరిపాటి అయింది.

మధులోని ఈ వింత మార్పుకి భార్యా బిడ్డలు మధు అంటే భయం పుట్టి బెంబేలెత్తి పోసాగారు.

ఒక రోజున మధు చిత్తుగా త్రాగి వచ్చి, ఏ కారణం లేకుండానే ఏదో వంక పెట్టి, భార్యని దుర్భాషలాడి, చితక బాదసాగాడు.

పిల్లలు అడ్డుపడితే వాళ్ళని కూడా చితకబాదాడు.

ఆ దెబ్బలకి తాళలేక "నేను పుట్టింటికి వెళ్ళి పోతాను. నేను ఇక్కడ బ్రతకలేను" అని ఏడుస్తూ



### చురక

*ఇటీవల నగ్మా కొన్ని నగ్నసత్యాలు చెప్తుందని ప్రెస్ కలిసినపుడు ఆమెను మాటల్లోకి దించుతూ శరత్‌కుమార్, రాధికల ప్రేమ వివాహం గురించి మీరేమంటారు? అని అడిగితే!*

*"ఇద్దరికీ మనుషుల్ని మార్చడం, మనసుల్ని మార్చుకోవడం అలవాటే మైనస్సు మైనస్సు ఎప్పుడయినా ప్లస్ అవుతుందా?! అంటూ చురకవేసింది. (మరి నగ్మా తక్కువతిందా!)*

గర్జించింది అతని భార్య.

"వెళ్ళిపో. తక్షణమే వెళ్ళిపో" అని మధు తాగిన మైకంలో ఆమె బట్టలు, ఆమె బ్యాగ్ బయటపారేసాడు.

ఆమె ఆ బట్టలు ఆ బ్యాగ్‌లో సర్దుకొని, పిల్లల్ని తీసుకొని, ఏడ్చుకుంటూ పుట్టింటికి వెళ్ళిపోయింది.

తెల్లవారింది.

మధు లేచి టైం చూసుకుంటే ఆఫీసు టైం అయింది.

ఎప్పుడూ అతని భార్య అతన్ని తొందరగా లేపి, అన్ని పనులు కానిచ్చి, సకాలానికి అతన్ని ఆఫీసుకి పంపేది.

ఇప్పుడు అతని భార్య లేక పోవటంతో ఇంత టైం అయింది.

త్వరత్వరగా ముఖం కడుక్కొని, స్నానం కూడా చేయకుండా, టీ, టిఫెన్‌లు తీసుకోకుండా ఆఫీసుకి హడావుడిగా వెళ్ళాడు.

అయినా చాలా ఆలస్యం అయింది.

మేనేజరు అందరి ముందే చివాట్లు పెట్టేసరికి మధుకి సిగ్గుతో చచ్చినంత పనయింది.

మధు ఆఫీసులో తన కుర్చీలో కూర్చున్నాడు.

స్నానం చేయకపోవటం వల్ల ఒళ్ళంతా చిరాగ్గా ఉంది.

టీ, టిఫెన్లు లేకపోవటం వల్ల కడుపులో ఆకలి కరకర లాడుతోంది.

తల నొప్పితో తల పగిలిపోతుంది.

'ఛీ..... ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది?' బాధతో తల పట్టుకున్నాడు.

'మద్యం మనుషులకి రకరకాల కారణాలవల్ల అలవాటు అవుతుంది. అది సరదా కోసం కావచ్చు. స్నేహితుల పౌరుషపు మాటల వల్ల కావచ్చు. పడిన శ్రమని మరిచి పోవచ్చనే పొరపాటు వల్ల కావచ్చు. మనశ్శాంతి లభిస్తుందనే అపోహ వల్ల కావచ్చు. ఇది మనుషులకి ఎలా అలవాటు అయినా, ఇది మనుషుల్ని సర్వ నాశనం చేసి, ప్రాణాలు తీసేదాకా వదిలిపెట్టదు. నాకు మాత్రం ఈ అలవాటు స్నేహితుల పౌరుషపు మాటలవల్లే అలవాటు అయింది. ఈ అలవాటు మహమ్మారిగా మారి నా జీవితాన్నే అల్లకల్లోలం చేస్తోంది' ఆవేదనతో తల కొట్టుకున్నాడు.

ఒక్కసారి రాత్రి జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.

'భార్య వుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు కదా! ఎప్పుడూ ఒక్కమాట అనకుండా ఎంతో అపురూపంగా చూసుకునే భార్యా బిడ్డల్ని ఈ మద్యం మహమ్మారి ఆవరించాక వాళ్ళని ఎన్నో దుర్భాషలాడాను. వాళ్ళని ఎన్నోసార్లు చితక బాదాను. ఈ మద్యం మహమ్మారి ఇల్లంతా గుల్ల చేసి, ఇంట్లో సామాన్లన్నీ అమ్మేలా చేసి, బజారు నిండా అప్పులై, అందరి చేత చివాట్లు తింటూ, అందరిచేత అసహ్యించుకో బడుతూ, అపురూపమైన భార్యా బిడ్డల్ని కోల్పోయేలా చేసింది. ఈ మద్యం వల్ల నేను సాధించినది ఏమిటి? ఏమీ లేదు. సర్వ నాశనం తప్ప! ఈ మద్యమే ఇంకా నన్ను ఆవరించి వుంటే - నేను సకాలానికి ఆఫీసుకి రాగలనా? రాకపోతే ఉద్యోగం వుంటుందా? ఉండక పోతే పరిస్థితి ఏమిటి? మైగాడ్.... ఊహించుకుంటేనే భయం వేస్తుంది. నో..... నో.... నేను మద్యాన్ని ముట్టుకోకూడదు. నాకు భార్యా బిడ్డలు కావాలి. నాకు సుఖవంతమైన జీవితం కావాలి. నాకు సమాజంలో గౌరవ ప్రతిష్టలు కావాలి. ఇవన్నీ కావాలంటే మద్యం వదులుకోవాలి. వదులుకుంటాను. నా భార్యా బిడ్డల దగ్గర క్షమాపణ కోరుకొని, మళ్ళీ ఆనందమయ జీవితానికి ఈ రోజునే శ్రీకారం చుడతాను' మధు విసురుగా కుర్చీలోంచి లేచి, ఆఫీసుకి సెలవు పెట్టి, తన భార్యా బిడ్డల్ని తెచ్చుకోవటం కోసం వాళ్ళ ఊరికి బయలుదేరాడు.

❀

